క్లుప్తంగా

ప్రమాద బీమా నిధులు ఇప్పించాలి



బాధితులతో మాట్లాడుతున్న సుమలత

కర్నూలు(సెంట్రల్): ప్రమాదాల్లో ఇంటి పెద్దను కోల్పోయి సాయం కోసం ఎదురు చూస్తున్న కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న ప్రమాద బీమా నిధులను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని రో ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. పెండింగ్ బీమాపై ప్రభుత్వం సంబంధిత కంపెనీలతో మాట్లాడి వెంటనే క్లెయిమ్‌లు అయ్యే లా చూడాలన్నారు. ఆదివారం ఆమె తన ఇంటిలో ప్రమాదబీమా బాధితులతో మాట్లాడారు. ప్రమాదాల్లో చనిపోయిన వారి కుటుంబాల క్లెయిమ్ పరిష్కరించడంలో కంపెనీలు తీవ్ర అలసత్వం చేస్తున్నట్లు చెప్పారు. బాధితులకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రాముడు, నాగప్ప, మాలిక్, శేషమ్మ, కర్రెమ్మ, బీసమ్మ పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో రాణించాలి



క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేసిన జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు

కర్నూలు (టౌన్): ప్రస్తుత సమాజంలో బాలికలకు మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల్లో శిక్షణ అవసరమని జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక పెద్ద మార్కెట్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బాల బాలికలకు బెల్ట్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన చిన్నారులకు కలర్ బెల్ట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినీ, విద్యార్థులు క్రీడలకు సమయం కేటాయించాలన్నారు. ఒత్తిడితో కూడిన చదువులను అధిగమించాలంటే క్రీడలు అవసరమన్నారు. కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. కరాటే మార్షల్ ఆర్ట్స్ వ్యవస్థాపకులు టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

జిల్లా యోగా సంఘం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన జిల్లా యోగా సంఘం కార్యవర్గ సభ్యులు

కర్నూలు (టౌన్): జిల్లా యోగా సంఘం చైర్మన్‌గా దండు లక్ష్మీకాంత రెడ్డి, అధ్యక్షుడిగా అవినాష్ శెట్టి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా డాక్టర్ ఎస్.ముంతాజ్ బేగం, ప్రధాన కార్యదర్శిగా కురువ మునిస్వామి ఎన్నికయ్యారు. ఆదివారం నగరంలోని క్రిష్ణానగర్‌లో ఉన్న యోగా సంఘం కార్యాలయంలో జిల్లా యోగా సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఏకగ్రీవంగా నిర్వహించిన ఈ ఎన్నికలకు రిటర్నింగ్ అధికారి న్యాయవాది శ్రీనివాసులు, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు వ్యవహరించారు. కమిటీ కోశాధికారిగా కుమ్మరి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సాయిక్రిష్ణ, బి.శ్రీనివాసులు, బ్రహ్మానందం, సంయుక్త కార్యదర్శులుగా లోకేష్, విజయభాస్కర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఆరుగురిని ఎన్నుకున్నట్లు న్యాయవాది వెల్లడించారు.

మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేనివి



మున్సిపల్ కార్మికులను సన్మానించిన దృశ్యం


కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిన సమయంలో మున్సిపల్ నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్లు రాత్రింబవళ్లు పనిచేసి నీటి సరఫరాను పునరుద్ధరించారని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష అన్నారు. లీకేజీ పనులు పూర్తి చేసిన మున్సిపల్ కార్మికులను ఆదివారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని కర్నూ లు ప్రగతి కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. నామమాత్రపు జీతాలతో పని చేస్తున్న నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లీకేజీ మరమ్మతులు చేసిన కార్మికులకు ప్రత్యేక భత్యం ఇవ్వాలని మున్సిపల్ అధికారులను విన్నవించారు. ఏపీఎం డబ్ల్యూ జిల్లా అధ్యక్షుడు మనోహర్, ఇబ్రహీం, వెంకటేశ్వర్లు, రంగ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగికి రెగ్యులర్ పేస్కేల్ తగదు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో కోర్టు ద్వారా నియమితులైన కాంట్రాక్ట్ ఉద్యోగికి రెగ్యులర్ పేస్కేల్ ఇవ్వడం తగదని అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.రాఘవేంద్ర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో జరిగిన 22వ పాలక మండలిలో ఆ ఉద్యోగిని తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఇవేమీ కోర్టుకు తెలియజేయకుండా ప్రస్తుతం వీసీ, రిజిస్ట్రార్ రెగ్యులర్ వేతనాలు చెల్లించడంతో పాటు అరియర్స్ ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలిసిందని దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

కామెర్లతో పరేషాన్ !

- ఏటా పెరుగుతున్న హెపటైటిస్ కేసులు
- కేంద్రం సాయంతో ఉచితంగా మందులు
- ఆల్కహాల్ సేవనం, కలుషిత నీరు, ఆహారాలే కారణం
- పెద్దాసుపత్రిలో ప్రతిరోజూ ఓపీ
- నేడు వరల్డ్ హెపటైటిస్ డే



హెపటైటిస్ వైరస్

కర్నూలు(హాస్పిటల్): వైరల్ ఇన్‌ఫెక్షన్ల వల్ల కళ్లు, చర్మం పచ్చగా మారడం, ఆకలి లేకపోవడం, తిన్నా వాంతులు కావడం వంటి లక్షణాలుంటే గ్రామీణ ప్రాంతాల్లో కళ్లను పరిశీలించి కామెర్లు వచ్చాయని నిర్ధారణకు వస్తారు. ఈ వ్యాధిపై ప్రజల్లో ఉన్న అవగాహన ఇది. వారికి పచ్చకామెర్లు, తెల్లకామెర్లు అని మాత్రమే తెలుసు. వైద్య పరిభాషలో మాత్రం వీటిని హెపటైటిస్ వ్యాధులుగా పిలుస్తారు. గ్రామీణ ప్రాంతాలు, మురికివాడల్లో ఇప్పటికీ నాటు మందులు వాడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటుండగా ఆధునిక వైద్య విజ్ఞానం మంచి మందులు అందుబాటులోకి తీసుకొచ్చి పోయే ప్రాణాన్ని నిలుపుతోంది. ఈ నెల 28న వరల్డ్ హెపటైటిస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవ కారణంగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో పీజీ సీట్లు మంజూరయ్యాయి. తత్ఫలితంగా పీజీ వైద్యులతో పాటు ప్రస్తుతం నలుగురు నిష్ణాతులైన గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు ఇక్కడ వైద్యసేవలు అందిస్తున్నారు. వైద్యుల సంఖ్య పెరగడంతో ఒకప్పుడు వారానికి రెండు రోజులు మాత్రమే ఉన్న ఓపీ గతేడాది నుంచి ఆరు రోజులుగా మారింది. సోమవారం నుంచి శనివారం వరకు వార్డులోనే ఓపీ నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి ఏమీ తినకుండా వచ్చి ఉంటే అప్పటికప్పుడే ఎండోస్కోపి పరీక్షలు కూడా చేస్తున్నారు. ఈ విభాగానికి హెపటైటిస్-బితో ప్రతి నెలా 80, హెపటైటిస్-సి రోగులు 60 మంది చికిత్స కోసం వస్తున్నారు. వైరల్ ఇన్‌ఫెక్షన్ల కారణంగా వచ్చే వ్యాధిగ్రస్తులు ఎక్కువగా కర్నూలు జిల్లాలోని కోడుమూరు, నంద్యాల జిల్లాలోని నంద్యాల, బనగానపల్లె, ప్యాపిలి, నందికొట్కూరు, తెలంగాణా రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లాలోని కొంకల గ్రామం నుంచి రోగులు వస్తున్నారు.

హెపటైటిస్ వ్యాధులు-రకాలు

హెపటైటిస్ అనేది కాలేయానికి సంబంధించిన వ్యాధి. ఇది సాధారణంగా వైరల్ ఇన్‌ఫెక్షన్ల వల్ల వస్తుంది. కొన్నిసార్లు ఇతర కారణాలు కూడా ఉండొచ్చు. ఉదాహరణకు వ్యాధులు, మందులు, మత్తు పదార్థాలు, విషాలు, మద్యం తీసుకోవడం వల్ల రావొచ్చు. వైరల్ హెపటైటిస్ నాలుగు ప్రధాన రకాల వైరల్‌ల ద్వారా కలుగుతుంది. వీటిలో ఏ, ఈ ఇన్‌ఫెక్షన్లు చాలా వరకు వాటంతటవే తగ్గిపోతాయి. సాధారణ కామెర్లు వీటితో వచ్చేవే. కానీ బీ, సీ వైరస్‌లు ప్రమాదకరమైనవి. ఇవి సమాజంలో 3 నుంచి 4 శాతం మందిని వేధిస్తున్నట్లు వైద్యుల అంచనా. కలుషిత నీరు, ఆహారానికి దూరంగా ఉంటే హెపటైటిస్ ఏ, ఈ వైరస్‌లు సోకకుండా చూసుకోవచ్చు.



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం

హెపటైటిస్‌కు ఉచితంగా మందులు

హెపటైటిస్-బీ, సీ వైరస్‌లతో బాధపడే వారికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంలో ఉచితంగా మందులు ఇస్తున్నారు. నేషనల్ వైరల్ హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రాంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2020 డిసెంబర్ 21వ తేదీ నుంచి ఈ మందులను రోగులకు ఉచితంగా అందజేస్తోంది. సాధారణంగా బి వైరస్ వారు మందులు ప్రైవేటుగా కొనాలంటే నెలకు రూ.1500, సి వైరస్ వారికి నెలకు రూ.15 వేల చొప్పున ఖర్చవుతుంది. ఇంత ఖరీదైన మందులను ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా ఇస్తున్నారు. వైద్యుల సూచన మేరకు కోర్సు ప్రకారం మందులు వాడితేనే ఈ వ్యాధి తగ్గుతుంది. ఈ మందులు మధ్యలోనే ఆపేస్తే అది కాలేయం ఫెయిల్యూర్ అయి లివర్ సిర్రోసిస్‌కు దారి తీస్తుంది.

నేడు వైద్య విద్యార్థులకు వ్యాక్సినేషన్



కేంద్ర ప్రభుత్వ సహకారంతో 2020 నుంచి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో హెపటైటిస్ వైరస్ ఇన్‌ఫెక్షన్‌లతో బాధపడే వారికి చికిత్స, మందులు, ఇమ్యునోగ్లోబ్లిన్స్‌ను సైతం ఉచితంగా అందజేస్తున్నాం. రూ.5 వేలకు పైగా ఖరీదయ్యే హెపటైటిస్ పరీక్షలు (వైరస్ లోడ్) కూడా ఇక్కడే ఉచితంగా నిర్వహిస్తున్నాం. అంతర్జాతీయ హెపటైటిస్ దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 28న కర్నూలు మెడికల్ కాలేజీలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులకు ఉచితంగా హెపటైటిస్ బి వ్యాక్సిన్ ఇవ్వనున్నాం.

–డాక్టర్ జి.మోహన్‌రెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌ఓడీ, జీజీహెచ్, కర్నూలు

బీ, సీ వైరస్‌లు ప్రాణాంతకం



ఇటీవల కాలంలో కాలేయ వ్యాధులతో బాధపడే వారి సంఖ్య పెరుగుతోంది. ఇందులో హెపటైటిస్‌లో బి, సి వైరస్‌లు దీర్ఘకాలిక జబ్బులుగా మారి ప్రాణాంతకమవుతాయి. దీనికి తోడు ఈ జబ్బుకు వైద్య పరీక్షలు, మందులు ఖర్చుతో కూడుకున్నవి. ఈ వ్యాధులకు గురిగాకుండా ఉండాలంటే బయటి ఆహారానికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలి. ఇంట్లో వండిన ఆహారం మాత్రమే తినాలి. వేపుళ్లు, అధికంగా నూనె వేసిన ఆహారాన్ని మానేయాలి. సమతుల ఆహారం తీసుకోవాలి. జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్‌లకు దూరంగా ఉండాలి.

– డాక్టర్ కె.నవీన్‌కుమార్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు

భక్తిశ్రద్ధలతో గాయత్రీ జప యజ్ఞం



ప్రత్యేక అలంకరణలో దేవతా మూర్తులు

కర్నూలు కల్చరల్: అయోధ్యలో శత కోటి గాయత్రీ పూర్ణాహుతి జరిగి సంవత్సరం పూర్తయిన నేపథ్యంలో ఆదివారం స్థానిక రాగమయూరి గ్రీన్ ల్యాండ్ కమ్యూనిటీలోని నారాయణి ప్రత్యంగిరా సేవ సదన్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. సంధ్యావందన అభ్యసన శిక్షణ సమితి ఆధ్వర్యంలో సమితి సభ్యులచే సామూహిక గాయత్రీ జపం నిర్వహించారు. కర్నూలు జోన్ సమన్వయకర్త గొల్లపిన్ని ఫణిరాజ్, సభ్యులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



గ్రంథాలయాధికారులకు పుస్తకాలు అందజేస్తున్న రామ్మోహన్

కర్నూలు కల్చరల్: వైద్యశాఖ విశ్రాంత ఉద్యోగి జి.రామ్మోహన్ జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పుస్తకాలను బహుకరించారు. ఆదివారం గ్రంథాలయాధికారులకు 30 పిరమిడ్ ఆధ్యాత్మిక పుస్తకాలను అందజేశారని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ పేర్కొన్నారు. ఈయన గతంలో కూడా పుస్తకాలను అందజేశారన్నారు. దీంతో పాటు ప్రజల ఆరోగ్యం కోసం ఉచితంగా ధ్యానం తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రామ్మోహన్ దాతృత్వానికి, సామాజిక స్పృహకు అభినందనలు తెలుపుతున్నామన్నారు.

పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు అంజిబాబు

ఓర్వకల్లు: మండలంలో నెలకొల్పనున్న పరిశ్రమలలో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మండల మహాసభలను ఘనంగా నిర్వహించారు. సీఐటీయు మండల అధ్యక్షుడు షాజహాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి అంజిబాబుతో పాటు, ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, సీపీఎం మండల కార్యదర్శి నాగన్న, సీఐటీయు జిల్లా నాయకులు గోపాల్, శ్రీధర్, రేణుకమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. పరిశ్రమలల్లో ఉద్యోగాలకు స్థానికులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. మండలంలో నిరుద్యోగుల సంఖ్య పెరిగిందని, చదువు, అర్హతను బట్టి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం స్కీం వర్కర్లను 4వ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు నిధులు విడుదల చేయాలని, అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను చెల్లించాలని కోరుతూ తీర్మానం చేశారు. సీఐటీయు మండల అధ్యక్షుడు షాజహాన్, మండల కార్యదర్శి శ్రీధర్, ఉపాధ్యక్షుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెవిలో చీము కారితే నిర్లక్ష్యం చేయొద్దు



వైద్యులకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ జయప్రకాష్ రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): చెవిలో చీము కారడాన్ని నిర్లక్ష్యం చేయరాదని, వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ బి.జయప్రకాష్‌రెడ్డి సూచించారు. స్థానిక ఎన్‌ఆర్ పేటలోని శ్రీ సత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన 36వ హ్యాండ్స్ ఆన్ ఆసికులో ప్లాస్టీ ఈఎన్‌టీ శస్త్రచికిత్సల వర్క్‌షాపు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ బి.జయప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. వర్క్‌షాపులో ఏపీ, తెలంగాణాతో పాటు మణిపూర్, ఢిల్లీ, కర్ణాటక, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వైద్యులు పాల్గొన్నారని తెలిపారు. చెవి లోపలి భాగంలో సూక్ష్మమైన ఎముకలు దెబ్బతిన్నప్పుడు వినికిడి లోపం కలుగుతుందన్నారు. వీటి పునర్నిర్మాణం కోసం అసిక్యులో ప్లాస్టీ చేయాల్సి ఉంటుందని వివరించారు. చెవిలో చీము కారడం వల్ల వినికిడి లోపంతోపాటు కొద్దిమందిలో ఇతర అనర్థాలకు దారి తీస్తుందన్నారు.

ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘం బలోపేతానికి కృషి



జేబీ రాజును కలిసిన అసోసియేషన్ నేతలు

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో ఏపీ ఎస్సీ సంక్షేమ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టాలని ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి జేబీ రాజు సూచించారని, సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు తెలిపారు. హైదరాబాద్‌లో కంటి ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న జేబీ రాజును ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో కలవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌కు సంబంధించిన అనేక విషయాలను చర్చించినట్లు చెప్పారు. రాబోవు రోజుల్లో అసోసియేషన్‌ను రాష్ట్రంలో బలమైన శక్తిగా తయారు చేయాలని వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి ఆకాంక్షించారన్నారు. ఆయన సూచనల మేరకు అసోసియేషన్‌లో అర్హులైన వారికి మరిన్ని బాధ్యతలు అప్పగించి వారి సేవలను ఉపయోగించుకుంటామన్నారు. జేబీ రాజును కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు దుంగ రత్నప్రసాద్, ఉపాధ్యక్షుడు వీ.రామస్వామి, కే.శ్రీనివాసరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్‌సీహెచ్ బజారన్న ఉన్నారు.

ఎస్‌పీజీ క్రైస్ట్ చర్చిలో ఎన్నికలు

కర్నూలు (టౌన్): నగరంలోని పార్కు రోడ్డులో ఉన్న ఎస్‌పీజీ క్రైస్ట్ చర్చిలో ఆదివారం చర్చి కమిటీ ఎన్నికలు నిర్వహించారు. 1300 మంది ఓటర్లు ఉన్న ఈ చర్చిలో రెండు ప్రధాన ప్యానెళ్లతో పాటు ఇండిపెండెంట్లు పోటీ చేస్తున్నారు. ఎన్నికల అధికారిగా సంద్యాల దయాసిస్ ఉపాధ్యక్షుడు పి.ఎ.వరప్రసాదరావు, రిటర్నింగ్ అధికారులుగా పాస్టర్ ఐజాక్ ప్రసన్న, జాన్సన్, థియోడర్, కలకత్తా రవి వ్యవహరించారు. చర్చి ఫాదర్ వరప్రసాదరావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో వెయ్యి మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని, కౌంటింగ్ ప్రారంభించి సోమవారం ఫలితాలు ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

స్మార్ట్ మీటర్లను తొలగించాలి



మాట్లాడుతున్న గురుశేఖర్

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం రజకులకు ఇబ్బంది కలిగించేలా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సి.గురుశేఖర్, జిల్లా అధ్యక్షుడు ముక్కన్న పిలుపునిచ్చారు. ఆదివారం చాకలి ఐలమ్మ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రజకులపై దాడుల నివారణ కోసం వెంటనే అట్రాసిటీ తరహాలో ప్రత్యేక చట్టాన్ని తెస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అంతేకాక రజకులకు 250 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న రజక పోస్టులను భర్తీ చేస్తామని చెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. అదిగో.. ఇదిగో అంటూ ఏడాది గడిచినా ఒక్క హామీ నెరవేర్చకపోవడంతో ధర్నాలకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. నాయకులు హనుమంతు, శ్రీనివాసులు, జయమ్మ, రాముడు, ఈరన్న, సూరి పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై వినతులు సమర్పించవచ్చని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లోనూ అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారని ఆయన వివరించారు.

అర్జీల పరిష్కార సమాచారం కోసం 1100 ఫోన్ నంబర్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు ఇచ్చిన వారు దరఖాస్తు పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. అలాగే meekosam.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు.

నగర పాలక సంస్థలో

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో నగరపాలకలోని అన్నివిభాగాల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

మానవత సేవలను విస్తృతం చేద్దాం



డాక్టర్ సాయి గౌతమ్‌ను సన్మానిస్తున్న మానవత సంస్థ సభ్యులు

కర్నూలు కల్చరల్: మానవత సేవలను విస్తృతం చేద్దామని మానవత సంస్థ కన్వీనర్ మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో జరిగిన నెలవారీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవ సమాజానికి ఉచితంగా పలు రకాల సేవలు అందిస్తున్నామన్నారు. 33 వైకుంఠ రథాలు, 42 ఫ్రీజర్ బాక్స్‌లు, 150 మొక్కలు, 11 మందికి రక్తదానం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం మానవత సభ్యులు డాక్టర్ సాయి గౌతమ్‌ను సన్మానించారు. సంస్థ నగర అధ్యక్షుడు జీవీ రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రోగ్రాం కమిటీ చైర్మన్ గోనూరు యుగంధర్ శెట్టి, యూనిట్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పాటిల్ హనుమంతరెడ్డి, ఆత్మీయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, నగర కార్యదర్శి ప్రసాద్‌రావు, పర్యావరణ కమిటీ చైర్మన్ వీర ప్రతాప్ మాట్లాడారు. సభ్యులు సఖ్యత, శీను, శోభన్, విజయ్, తిరుపతి సాయి, మల్లికార్జునరెడ్డి, శివశంకర్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

కల్లూరు: కల్లూరు అర్బన్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య అస్తవ్యస్తంగా తయారైందని, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. కొన్ని కాలనీల్లో డ్రైనేజీలు పూడికతో నిండగా, మరికొన్ని కాలనీల్లో డ్రైనేజీ కాలువలపై పిచ్చి మొక్కలు పెరగడంతో మురుగు నీరు ముందుకు పారడం లేదు. దీంతో దోమలు, లార్వాలు, ఈగలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు.

నాటక రంగంపై దృష్టి సారించాలి



అతిథులను సన్మానిస్తున్న నిర్వాహకులు

కర్నూలు(అర్బన్): ప్రస్తుతం సెల్‌ఫోన్, యూట్యూబ్, సినిమాలతో దారి తప్పుతున్న యువత నాటక రంగం వైపు దృష్టి మళ్లించాలని కర్నూలు ఏపీఎస్‌పీ కమాండెంట్ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక టీజీవీ కళా క్షేత్రంలో షాద్‌నగర్‌కు చెందిన బాలికలు 'మాకు స్వాతంత్ర్యం కావాలి' అనే నాటకాన్ని ప్రదర్శించారు. అలాగే బాపట్ల జిల్లా ద్రోణాదుల పరిషత్ ఆధ్వర్యంలో 'వర్క్ ఫ్రం హోం' అనే లఘు నాటికను ప్రదర్శించారు. ముందుగా నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, జేఎన్ శేషయ్య, పి.దస్తగిరి, కార్యదర్శి మహమ్మద్ మియ్యా, వ్యాఖ్యాత యాగంటీశ్వరప్ప, ఇనాయతుల్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాకు స్వాతంత్ర్యం కావాలి నాటిక ప్రతి ఇంట్లో అత్త కోడలికి మధ్య జరిగే పోరాటానికి పరిష్కారం తెలిపిందన్నారు. అలాగే భార్యాభర్తలు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు అయితే వారి మధ్య ఏర్పడే తగాదాలను వర్క్ ఫ్రం హోం నాటిక చక్కగా వివరించిందన్నారు. ఈ నాటికల్లో మహేంద్ర, శివరాం, ప్రసాద్, షేక్ షఫీ, నాగేశ్వరరావు, లహరి తదితరులు చక్కగా నటించారన్నారు. ఈ సందర్భంగా సెన్సార్ బోర్డు సభ్యులు టీవీ రంగయ్య, దర్శకులు బీ.మహేంద్ర, సినీ నటి లహరి, బీటీ లక్ష్మన్నను ఘనంగా సన్మానించారు.

రేపు సీపీఐ సమావేశం

కర్నూలు(సెంట్రల్): సీపీఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఈనెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 9, 10, 11 తేదీల్లో కర్నూలులో నిర్వహించే సీపీఐ 24వ జిల్లా మహాసభల విజయవంతం కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య వస్తున్నారని వివరించారు. జిల్లా కౌన్సిల్ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

ఆధ్యాత్మిక సేవలో పాలు పంచుకోవాలి



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు

కర్నూలు కల్చరల్: ఆధ్యాత్మిక సేవలో పాలు పంచుకోవాలని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని శ్రీ జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులను సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన సందేశమిస్తూ.. ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. జీవన ఉన్నతికి, ఉత్తమ జీవన విధానానికి భగవద్గీత దిక్సూచిలా పనిచేస్తుందన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన జప యజ్ఞం చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో ప్రతిష్టంభనపై ఆందోళన

కర్నూలు(అర్బన్): శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం 2017లో ఇచ్చిన నోటిఫికేషన్‌కు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ నిరుద్యోగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో నేటికి ప్రతిష్టంభన నెలకొందని మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసారపు వెంకటేష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. ఈ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టిన సమయంలో కొందరు నోటిఫికేషన్‌ను నిలుపుదల చేయాలని హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చారన్నారు. దాదాపు 9 సంవత్సరాలు గడు స్తున్నా, నేటికీ యూనివర్శిటీ అధికారులు, ప్రభుత్వాలు నిరుద్యోగుల పక్షాన వాదనలు వినిపించడంలో వెనుకబడ్డాయన్నారు. ఇప్పటికైనా నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన యూనివర్సిటీ అధికారులు తమకేమి సంబంధం లేని విధంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇప్పటికై నా ఉన్నత విద్యాశాఖ అధికారులు చొరవ చూపి నిరుద్యోగులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఎస్‌కే యూనివర్సిటీని ముట్టడిస్తామన్నారు.